క్లుప్తంగా

స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం



వివేకానందకు నివాళి

తిరుపతి గాంధీరోడ్: స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్వీ మెడికల్ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి, భారత యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, మల్లారపు రవి ప్రసాద్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, దీపక్ యాదవ్, మిమిక్రీ ఆర్టిస్ట్ శాంబోల హరినాథ్, మురళి పాల్గొన్నారు.

ఆంగ్లంపై ఉండే భయాన్ని పోగొట్టాలి

పాకాల: చిన్నతనం నుంచి విద్యార్థుల్లో ఆంగ్లంపై ఉండే భయాన్ని పోగొట్టాలని ఎంఈఓ బాబ్జి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పచ్చిపాలపల్లి, అగ్రహారం ఎంపీపీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతీ రోజూ ఉపాధ్యాయులు కొన్ని ఆంగ్ల పదాలను, వాక్యాలను విద్యార్థులకు నేర్పించాలని, బోర్డుపై రాయించాలని తెలిపారు. అలాగే విద్యార్థులతో హోంవర్క్, వర్క్‌బుక్స్ కూడా రాయించాలని సూచనలు చేశారు. తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, వారి ప్రగతిని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు శేషాద్రి, జ్యోతిప్రసాద్, ఉపాధ్యాయులు కేశవరావు, సీఆర్పీ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్త సరళ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కేసులు పరిష్కరించండి

తిరుపతి కల్చరల్: రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు తహశీల్దార్ తదితర అధికారులపై విధించిన క్రమశిక్షణ కేసులపై స్పందించి త్వరితగతిన పరిష్కరించి, ఆదుకోవాలని రిటైర్డ్ తహశీల్దార్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు ఎన్.జయచంద్ర విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇరవయ్యేళ్లుగా కొలిక్కిరాని కేసులతో బతుకులు ఛిద్రమవుతున్నాయని తెలిపారు. కేసులు ఉండి అవి పరిష్కారం కాకుండా సర్వీసు నుంచి రిటైర్డ్ అయిన వారి బాధలు వర్ణనాతీతమని తెలిపారు. పూర్తి పెన్షన్‌లో 75 శాతం పెన్షన్ మాత్రమే ఇస్తారని వాపోయారు. క్రమశిక్షణ కేసులపై స్పందించి వాటికి పరిష్కార మార్గం చూపి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


టాటా చైర్మన్‌కు ఘనస్వాగతం



చంద్రశేఖరన్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: టాటా గ్రూప్ ఆఫ్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు టీటీడీ ఈఓ శ్యామలరావు గురువారం ఘన స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న ఆయనకు పద్మావతి పురం వద్ద స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకోనున్నారు. ఆయనతో పాటు టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్న కూడా ఉన్నారు.

48 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: స్థానిక చిగురువాడలోని గేట్ కళాశాలలో సత్యం ఇన్ఫోటెక్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో సుమారు 48 మంది డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో ఏటా ఎన్నో ఎంఎన్‌సీ కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సత్యం ఇన్ఫోటెక్ సీఈఓ గిరీష్, ప్రిన్సిపల్ ప్రణీత్, రమేష్, రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యేల సన్మానం

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో పలువురు ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి, దుశ్శాలువాలతో సత్కరించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పోరాట యోధుడు అల్లూరి





అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు, సిబ్బంది, అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ



మాట్లాడుతున్న ఎస్వీయూ తెలుగు విభాగం పరిశోధకుడు రమేష్‌బాబు

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

తిరుపతి మంగళం: తిరుపతి కపిలతీర్థం సమీపంలో ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్, సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ, ఎఫ్ఆర్‌ఓలు మురళీకృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ రజని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ గీతావాణి, పలు విభాగాల డీన్లు అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల అభిమన్యుడు అల్లూరి

తిరుపతి కల్చరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల అభిమన్యుడని, ఆయన ఆంధ్రుడు కావడం గర్వకారణమని ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు రమేష్‌బాబు ఉద్ఘాటించారు. టీటీడీ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో గురువారం అన్నమాచార్య కళామందిరంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా విచ్చేసి ప్రసంగించారు. తొలుత టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో ఆనందరాజు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం మొదటి సారిగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ఈ జయంతి వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమన్నారు. అనంతరం పలువురు టీటీడీ ఉద్యోగులు, ఉద్యోగసంఘం నేతలు అల్లూరి జీవిత చరిత్రపై ఉపన్యసించారు. డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కృష్ణవేణి, ఇతర అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ప్రతిష్టించాలి

తిరుపతి కల్చరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని తిరుపతి నగరంలో ప్రతిష్ఠించాలని కోరుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌కు విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఇంత వరకు ప్రతిష్టించకపోవడం విచాకరమని, ఇప్పటికైనా అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కార్పొరేటర్లు నరసింహాచారి, ఆర్‌సి.మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, అనిల్ కుమార్, వరికుంట్ల నారాయణ ఉన్నారు.

అల్లూరికి ఘననివాళి

చంద్రగిరి: స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ నాయకుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ లలిత కుమారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లదొరల నిరంకుశ పాలనను పారద్రోలడానికి అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. మన్యంలో జీవిస్తున్న బడుగులను తన సైన్యంలోకి తీసుకుని బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదుర్కొని మన్యం దొరగా ఆయన కీర్తింపబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం అందరికీ ఆదర్శం

తిరుపతి తుడా: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని గురువారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కమిషనర్ అదితిసింగ్ అధికారులతో కలిసి అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అల్లూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా సమక్షంలో ఈ వేడుకలను నిర్వహించారు. చరిత్ర శాఖాధిపతి చిట్టికళావతి అల్లూరి జీవిత విశేషాలను వివరించారు. వైస్‌ప్రిన్సిపల్ సురేంద్ర, అధ్యాపకులు రమేశ్‌కుమార్, మాధవి, ఈశ్వర్‌బాబు, రమణమ్మ, రవి, లక్ష్మీప్రసాద్, విష్ణుప్రియ, వినోద్ తిదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మునిరాజ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి అధ్యక్షతన అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులు ఎర్రయ్య, హరినాథాచారి, నాగరాజు నాయుడు, హరి, శారద, ఆనంద్, ప్రసాద్, ఫరీన్, వెంకటకృష్ణ, గిరిజ, మోహనరంగ, వెంకటచలమారెడ్డి పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో..

తిరుపతి కల్చరల్: రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో శివజ్యోతినగర్‌లోని అంధుల పాఠశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అంధులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ బలరామరాజు, నాయకులు రాధాకృష్ణ వర్మ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు రుద్రరాజు శ్రీదేవి, వసంతమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరికి నివాళి...

తిరుపతి మంగళం: తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మనదేశం నుంచి బ్రిటీష్ వాళ్లను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కొనియాడారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, కార్పొరేటర్లు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



అంధులకు పండ్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు

ఉర్దూ చదువుతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి

తిరుపతి కల్చరల్: ఉర్దూ ద్వితీయ భాషగా చదువుకున్న ముస్లిం విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగావకాశాలు ఉన్నాయని అంజుమన్ తరక్కీ ఉర్దూ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి తెలిపారు. అంజుమన్ తరక్కీ సంస్థ ఆధ్వర్యంలో ఉర్దూ ద్వితీయ భాషగా చదువుకుంటే కలిగే ప్రయోజనాలపై గురువారం అనంతవీధి ఎదురుగానున్న ఏఎస్‌టీఎస్ కళాశాలలో ముస్లిం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉర్దూ భాషను ద్వితీయ అధికార భాషగా గుర్తించిందన్నారు. ఉర్దూ భాష అభివృద్ధితోపాటు ముస్లిం విద్యార్థుల ఉన్నతికి తోడ్పడాలనే లక్ష్యంతో ఏడేళ్లుగా అంజుమన్ తరక్కీ సంస్థ తిరుపతి విభాగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఏఎస్‌టీఎస్ కళాశాల వేదికగా ముస్లిం విద్యార్థులకు ఉర్దూ ద్వితీయ భాషగా చదువు కొనసాగించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ఉర్దూ భాషతో ఉన్నత విద్య అభ్యసించిన వారికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. అంజుమన్ తరక్కీ సంస్థ కార్యదర్శి డాక్టర్ అంజాద్ అలీబేగ్, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ నిస్సార్ అహ్మద్, మైనారిటీ నాయకులు ఖాదర్ బాషా, షేక్ మహ్మద్, గఫూర్, ముస్లిం యువకులు, ఉర్దూ భాషాభిమానులు, ముస్లిం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవినీతికి దూరంగా ఉండండి

తిరుపతి రూరల్: అధికారులు అవినీతికి దూరంగా ఉండాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా పేదలకు న్యాయం చేయాలని సూచించారు. చాలా విభాగాల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని, కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేశారని ఆరోపించారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అధికారులు తీరు మార్చుకోకుంటే మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

టీడీపీ నేతలతో కలిసి సమీక్షలా?

ఎమ్మెల్యే హోదాలో మండల సమావేశానికి మొదటిసారి విచ్చేసిన నానికి ఎంపీడీఓ రమేష్‌బాబు, సిబ్బంది స్వాగతం పలికారు. అధికారిక సమావేశంలో టీడీపీ నేతలు కూర్చోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మీడియాను సైతం బయటకు పంపిన ఎమ్మెల్యే నాని, టీడీపీ నేతలను ఏ హోదాలో కూర్చోపెట్టుకుని సమావేశం నిర్వహించారని అధికారులే గుసగుసలాడడం కనిపించింది.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

తిరుపతి తుడా: తిరుపతి శివజ్యోతినగర్‌లోని తంబువానిగుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. 2023– 24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 600 మార్కులకు 500 పైగా సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, రఘునాథ్, ప్రోత్సాహక నగదు దాతలు కదిరి రాజేంద్ర, మనీష్ గుప్తా, మునిరత్నం, రాధాకృష్ణ, సుజాత, జగన్నాథం, కృష్ణమూర్తి, చంద్ర పాల్గొన్నారు.

అలరించిన ‘ద్విగళ అష్టావధానం’

తిరుపతి కల్చరల్: ఇంటర్‌నెట్ వేదికగా గురువారం నిర్వహించిన ద్విగళ అష్టావధానం సాహితీ అభిమానులను అలరించింది. శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, ఈదమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గెంటేల జగదీష్ చంద్ర కుమార్ సభను పరిచయం చేశారు. నేమాని ప్రసాద్ (ముంబయ్)ముఖ్యఅతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. కటం వేంకట రామశర్మ సంచాలకులుగా వ్యవహరించారు. అవధానులుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన రంప సాయికుమార శర్మ, సుసరాపు చంద్రశేఖరశర్మ తమ సాహితీ విద్వత్తుతో అందరినీ ఆకట్టుకున్నారు. పృచ్ఛకులుగా డాక్టర్ కొణిదల శోభ (తిరుపతి), కొరుప్రోలు రాధాకృష్ణారావు, అరవల్లి శ్రీదేవి, ఉప్పలపాటి కుసుమకుమారి, భానుమతి హట్టి, తాటికొండ శివకుమార్, విమల ఆర్యసోమయాజులు, మనసాదేవి పాల్గొన్నారు. అవధానంలోని అంశాలైన నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వ్యస్తాక్షరి, వర్ణన, ఆశువు, ఛందోభాషణం, అప్రస్తుత ప్రసంగం ద్వారా అవధానులకు ప్రశ్నలు సంధించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ అవధానాన్ని పలువురు సాహితీవేత్తలు, అభిమానులు వీక్షించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లపై అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: మాస్టర్ ప్లాన్ రోడ్లపై పచ్చ పత్రికలు విషం చిమ్ముతూ అసత్య ప్రచారం చేయడం విడ్డూరమని వైఎస్ఆర్ సీపీ నేత, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలను తీర్చాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మాణం చేపట్టి ప్రజల మన్ననలు పొందడమేకాక రాష్ట వ్యాప్తంగా ప్రశంసలు పొందారన్నారు. గత రెండు రోజులుగా కులశేఖర ఆళ్వార్ మార్గం కుంగిపోయిందని, నాసికరంగా రోడ్లు వేశారని పచ్చ పత్రికలు పని గట్టుకొని రాయడం సరికాదన్నారు. విద్యుత్ లైన్ల కోసం ఎస్పీడీసీఎల్ వారు రోడ్డును పరిధికి మించి తవ్వడంతో ఈ సమస్య వచ్చిందన్నారు. దీనిపై ఈఈ దామోదరం కూడా వివరణ ఇచ్చారని తెలియజేశారు. వాస్తవాన్ని విస్మరించి మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం చేపట్టిన భూమన అభినయరెడ్డిపై నిందారోపణలు చేయడం దారుణమన్నారు. 20 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మిస్తే 16 రోడ్లు జనావాసాల మధ్య నిర్మించడం, మిలిగిన రోడ్లు ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా చేపట్టినవేనన్నారు. తిరుపతి నగరంలో ఇంకా 14 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించాల్సి ఉందని, దీనిపై దృష్టి సారించి రోడ్లు వేస్తే మంచిదన్నారు.

స్విమ్స్ దంత వైద్య విభాగంలో ఎక్స్‌రే సేవలు

తిరుపతి తుడా: స్విమ్స్ దంత వైద్య విభాగంలో ఎక్స్‌రే సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక ఐఓపీఏ ఎక్స్‌రేతోపాటు ఆర్వీజీ సేవలు అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలిపారు. అత్యంత సూక్ష్మ సమస్యలను గుర్తించేందుకు ఈ వైద్య పరికరాలు దోహదపడతాయని అన్నారు.

ఇద్దరికి గాయాలు

రామచంద్రాపురం: సీరామాపురం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. గురువారం తిరుపతి రిక్షా కాలనీకి చెందిన అరుణ్‌కుమార్, విద్యానగర్‌కు చెందిన ఉమా భవన నిర్మాణ కూలీ పనులు ముగించుకుని బైక్‌లో తిరుపతికి వెళ్తుండగా, అదే సమయంలో ఓ ఆటోను డ్రైవర్ నితిన్ కుమార్ వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొన్నాడు. అరుణ్‌కుమార్, ఉమాకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు.

నీట్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకోండి



టవర్‌క్లాక్ వద్ద విద్యార్థుల మానవహారం

చంద్రగిరి: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ నీట్ పరీక్ష పేపర్లు లీక్‌కు కారకులైన వారిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తేజ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ కావడంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బంద్‌కు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని విద్యాసంస్థలు బంద్‌ను పాటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్లు లీకేజీకి కారణమైన ఎన్‌టీఏ సంస్థను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని కోరారు. అలాగే యూనివర్సిటీ కేంద్రాల్లో విద్యార్థులపై అక్రమ కేసులు ఆపాలని, 2016లో నిర్వహించిన విధంగా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు 13 భాషల్లో పరీక్షలు రాసుకునేందుకు అనుమతించగా, కేంద్ర ప్రభుత్వం కేవలం రెండు భాషల్లో మాత్రం అని చెప్పడం విచారకరమన్నారు. కేంద్ర విద్యాశాఖ వైఫల్యంతో జరిగిన ఘటనపై వెంటనే కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పాఠశాలల మూసివేతకు శ్రీకారం చుట్టిందని, దాన్ని వెంటనే ఆపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, సుభాన్, హర్షద్, విద్యార్థులు పాల్గొన్నారు.